

పెద్దదర్గాను సందర్శించిన 'పద్మవ్యూహం' నటులు

కడప అర్బన్ : నగరంలోనిపెద్ద దర్గాను పద్మ వ్యూహం సినిమా హీరో ప్రవీణ్ రాజ్, హీరోయిన్ షితల్ శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ప్రతినిధి అమీర్ దర్గా సంప్రదాయం ప్రకారం సన్మానించారు. దర్గాలోని ప్రధాన మాజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయించి ప్రతిష్టను వారికి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగిందని, దర్గా గురించి తెలిసి ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు. దర్శించిన తర్వాత మనసుకు ప్రశాంతత కలిగిందని చాలా సంతోషంగా ఉందని తెలిపారు.



ప్రార్థన నిర్వహిస్తున్న హీరో, హీరోయిన్

పశుసంవర్ధక భవన నిర్మాణ పనులపై విచారణ

- ఎసిబి డిఎస్‌పి, ఎస్ఐ రికార్డుల పరిశీలన
- రూ.4 కోట్ల పనుల అసంపూర్తిపై ఆరా



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పశుసంవర్ధక శాఖ పాలీవెటర్నరీ క్లినిక్ భవన నిర్మాణ పనులపై ఎసిబి దృష్టి సారించింది. 2016-17 సంవత్సరంలో ప్రభుత్వం నాబార్డు సౌజన్యంతో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రూ.4 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టింది. 2022 నాటికి గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణ పనుల్ని పూర్తి చేసింది. మిగిలిన మూడు, నాలుగు అంతస్తుల పనుల్ని పూర్తి చేయడానికి నిధుల కొరత పేరుతో వదిలేసింది. జిల్లా పశుసంవర్ధక శాఖలో అడిషనల్ డైరెక్టర్ల మధ్య విభేదాలు రావడంతో రచ్చకెక్కింది. ఫిర్యాదుల వెల్లువెత్తిన కారణంగా విజయవాడ ఎసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలోని బృందం రహస్యంగా విచారించినట్లు సమాచారం. ప్రస్తుత ఎడి అచ్చెన్నను విపిసి భవన నిర్మాణ పనుల్లోని ఎల క్రిఫికేషన్, వుడ్, నాసిరకపు క్వాలిటీ వంటి అంశాలను ఆరాతీయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు ఎడిల మధ్య నెలకొన్న విబేధాల కారణంగా నలుగురు ఉద్యోగుల సరెండర్స్, ఎస్‌సి, ఎస్‌టి కేసుల వంటి ఘటనలకు అదనంగా ఎసిబి విచారణ వ్యవహారం చేరడంతో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా తయారైంది. కర్నూలు, హిందూపురం పట్టణాల్లో విపిసి భవన నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు సమాచారం. కడపలో విపిసి భవన నిర్మాణ పనులు ఎందుకు పూర్తి చేయలేదని, నాసిరకపు పనుల నిర్మాణాలకు బాధ్యులు, అసంపూర్తి నిర్మాణ పనుల సమయంలో స్వాధీనం చేసుకున్న పశుసంవర్ధకశాఖ అధికారులు ఎవరు, ఎందుకు స్వాధీనం చేసుకోవాల్సి వచ్చిందనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. విపిసి భవన నిర్మాణ పనులు జరుగుతుండగా అప్పటి జెడి సత్యప్రకాష్, ఎడిలుగా శ్రీధర్‌కుమార్‌లకు గల ఆసక్తి, అవసరం ఏమిటనే కోణంలో విచారించినట్లు సమాచారం. దీనిపై త్వరలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 5 స్థానాలకు గాను ఎన్నికల నిర్వహణకు ఈ నెల 9న ఎన్నికల కమిషన్ ప్రకటన విడుదల చేసిందన్నారు. అదే రోజు నుంచి జిల్లాలో ఎన్నికల నియమనిబంధనలు (ఎన్నికల కోడ్) అమలులోకి వచ్చాయన్నారు. పోలింగ్ స్టేషన్ల జాబితాకు సంబంధించి నివేదికను అనంతపురం జిల్లా కలెక్టర్ కు పంపించాల్సి ఉన్న నేపథ్యంలోఇప్పటికే విడుదల చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం 1400లకు మించి ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఒక్కో ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రకారంగా జిల్లాలో ఏడు పోలింగ్ స్టేషన్లకు అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసుకునేందుకు గాను సంబంధిత తహశీల్దార్ల నుండి ప్రతిపాదనలు వచ్చాయని చెప్పారు. కడపలో నాలుగు పోలింగ్ స్టేషన్లలో అక్షర దోషాలను సవరణ కోసం అనంతపురం జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపుతామని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 13 సాయంత్రం వరకు వచ్చే ఓటరు నమోదు దరఖాస్తులను మాత్రమే స్వీకరించబడుతాయన్నారు. అనంతరం వాటిని పరిశీలించి ఓటింగ్ నాటికి తుది జాబితాలో చేరుస్తామన్నారు. ఎన్నికల నియమావళిని ఏ ఒక్కరూ కూడా ఉల్లంఘించరాదని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆయా పార్టీల నేతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల వద్ద అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించడంతో పాటు, సున్నితంగా వ్యవహరించాలన్నారు. **స్ట్రాంగ్ రూముల పరిశీలన..** శుక్రవారం కలెక్టరేట్ లోని ఇవిఎం గోడౌన్ల (స్ట్రాంగ్ రూమ్)ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ పరిశీలించారు. సందర్భంగా ఆయన గోడౌన్ల రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఇవిఎంల స్థితి లోపాలుఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. కార్యక్రమంలో కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర గౌడ్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శివారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎం.మల్లికార్జున, ఈ. జనార్దన్, నీలి శ్రీనివాస రావు, కానుగ దానం, సగిలి గుర్రప్ప , ఎల్.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గిఫ్ట బాక్సులు' స్వాధీనం

ప్రజాశక్తి - బద్వేలు

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 16న నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం ఓ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి ఉపాధ్యాయులకు గిఫ్ట్‌బాక్స్‌లను పంచేందుకు యత్నించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గిఫ్ట్‌బాక్స్‌లను పంపిణీ చేస్తున్న సమాచారం తెలుసుకున్న సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బాబాఫక్రుద్దీన్, ఆర్ఐ నాగేశ్వరి పాఠశాలకు వెళ్లారు. అప్పటికే అక్కడ వదిలి వెళ్లిన గిఫ్ట్‌బాక్సులను స్వాధీనం చేసుకుని తమ కార్యాలయానికి తరలించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడటం తగదు

జమ్మలమడుగు రూరల్ : టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి ఓట్ల కోసం జమ్మలమడుగు పట్టణంలో ప్రయివేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు టిఫిన్ బాక్స్‌లు పంపిణీ చేయడానికి విస్తృతంగా పట్టణంలో పంపిణీ చేస్తూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డం దారుణమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివ కుమార్ అన్నారు. పంపిణీ చేస్తున్న టిఫిన్ బాక్సులను డివైఎఫ్ఐగా అడ్డుకొని స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారన్నారు. టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి నేరుగా ఎన్నికలలో గెలవలేననే భయంతో అక్రమాలకు తెరలేపారన్నారు. ఒక బాధ్యతాయుత విద్యాసంస్థలు నడుపుతూ ఓట్ల కోసం ఇలా ముడుపులు ఇవ్వాలనుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు, టీచర్లకు ఫలానా సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి ఓట్లు అభ్యర్థించాలని పేర్కొన్నారు. ఎన్నిక నియమావళి తప్పిన ఆయనపై కేసు నమోదు చేసి ఎన్నికలలో పోటీ చేయకుండా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి సాయి, సిఐటియు పట్టణ నాయకులు దాసు పాల్గొన్నారు.



బద్వేల్ : గిఫ్ట్‌బాక్స్ ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆధార్ కార్డుకు అనుసంధానంగా ఉన్న వేలి ముద్రలను క్లోనింగ్ చేసి ప్రజల బ్యాంక్ ఖాతాల నుంచి వారికి తెలియకుండా నగదు కాజేస్తున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసులు అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తులు ఆధార్ ఆధారిత సమాచార దుర్వియోగం కేసులో గోరఖ్ పూర్, ఉత్తప్రదేశ్ కు చెందిన వికాస్ అలియాస్ విక్కీ అలియాస్ సుజిత్, అజంగడ్ జిల్లాకు చెందిన అక్షయ్ యాదవ్ అనే నిందితులను అదుపులోకి తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సుమారు 440 మంది వేలి ముద్రలను తయారు చేసి బ్యాంకు ఖాతా లోని నగదును కేటుగాళ్ళు కాజేస్తున్నారని తెలిపారు. బ్యాంకు కస్టమర్ సర్వీస్ పాయింట్ అనుమతి తీసుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని చెప్పారు. నిందితులపై దేశవ్యాప్తంగా ఎన్‌సిఆర్‌పి పోర్టల్ లో 308 ఫిర్యాదులు, 128 ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారని పేర్కొన్నారు. మూడు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఖాతాల ద్వారా మోసానికి పాల్పడ్డారని చెప్పారు. జిల్లాలో ఇంకా ఎవరైనా బాధితులుంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజలందరూ తమ ఆధార్ కార్డుల బయోమెట్రిక్ లాక్ లేదా తగు భద్రత చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడి, ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, సైబర్ క్రైమ్ సిఐ శ్రీదర్ నాయుడు, చిన్న చౌక్ సిఐ శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్ఐలు మధు మల్లేశ్వర్ రెడ్డి, అమర్ నాధ్ రెడ్డి, రవి కుమార్, శ్రీనివాస్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

261 మొబైల్ ఫోన్లు రికవరీ
- బాధితులకు అప్పగింత

వాట్సాప్ నంబర్ 9392941541 ప్రారంభించిన అతి తక్కువ కాలంలో రూ. 70 లక్షల విలువైన 261 మొబైల్ ఫోన్లు సైబర్ క్రైమ్ టెక్నాలజీ విభాగం రికవరీ చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశామని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు లేకుండా ఫోన్లు పోగొట్టుకున్న వారికీ తిరిగి అందజేయాలనే సంకల్పంతో గత ఏడాది డిసెంబర్ 1 న ప్రారంభించిన ఎంఎంటిఎస్ (మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం) ద్వారా ఉచిత వెబ్ సైట్ సేవలు అందజేస్తున్నామని చెప్పారు. . ప్రజలకు మరింత సులువైన సేవలు అందించడానికి చాట్ బాక్స్ ద్వారా 9392941541 సేవలు ప్రారంభించారని పేర్కొన్నారు. ఇప్పటివరకూ 2300 మొబైల్స్ మిస్సింగ్ ఫిర్యాదులు రాగా ఎంఎంటిఎస్ ద్వారా 510 యాక్టీవ్ మొబైల్స్ గుర్తింపు, ప్రస్తుతం దాదాపు రూ. 40 లక్షల విలువైన 131 మొబైల్స్‌ను రికవరీ చేసి బాధితులకు అందజేశామని చెప్పారు. సరైన బిల్లులు లేకుండా ఎవరూ మొబైల్ ఫోన్స్ కొనవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) తుషార్ డూడి, ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ఇన్‌స్పెక్టర్ వి.శ్రీధర్ నాయుడు, ఎస్ఐలు మధు మల్లేశ్వర రెడ్డి, రవి కుమార్, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడే జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10. 30 నుండి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మొదటి అదనపు జిల్లా జడ్జి సి.ఎస్. మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సత్వర న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. కడప5, ప్రొద్దుటూరు5, రాయచోటి 3, రాజంపేట 2, బద్వేల్ 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులో ఒక్కొక్క బెంచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 08562 258622, 244622కు districts.ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com ద్వారా గాని సంప్రదించవచ్చునని తెలిపారు. కోవిడ్-19 నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని తెలిపారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలి

ప్రజాశక్తి - కాశినాయన

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరు కోవచ్చుని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం ఆయన మండల పరిధిలోని వరికుంట్ల కస్తూర్బా, నరసాపురం జడ్‌పి హైస్కూల్, ఎపి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదిలోనే రూపు దిద్దుతుందని, కనుక ప్రతి విద్యార్థి లక్ష నిర్దేశంతో చదివి ఇటు తల్లిదండ్రులకు అటు పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆయన కోరారు. విద్యార్థులు ఇంగ్లీషులో మంచి ప్రతిభ సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని సూచించారు. విద్యార్థులు ఇప్పుడు కష్టపడి చదివితే ఎంత శిఖరాన్ని అయినా చేరుకోవచ్చని చెప్పారు. విద్య పట్ల మన రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రత్యేక శ్రద్ధ చూపించే విద్యార్థుల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని అన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూరిబా మున్సిపల్ మెర్సీ రాణి, నరసాపురం జడ్‌పి హైస్కూల్ హెచ్ఎం సువాసిని, ఏపీ మోడల్స్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ పిఒ

రేపు యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి- కడప అర్బన్

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈనెల 12 నిర్వహించనున్నట్లు యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరించే దురుద్దేశంతో కొత్త, కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక విద్యారంగం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో సిబిఎస్ఇ సిలబస్ పేరుతో బైజూస్ కంటెంట్ ప్రవేశపెడుతున్నట్లు భ్రమలు కల్పించి అర్థం కాని చదువులను విద్యార్థుల కు చొప్పించి పేద, బడుగు, బలహీన వర్గాలను విద్య నుంచి దూరం చేసే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఉపాధ్యాయులు త్రిశంకు స్వర్గంలో ఉన్నారని తెలిపారు. సమావేశాలకు ముఖ్య అతిధులుగా యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీ రాజా, రఘుపతి రెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టూటౌన్ ఎస్ఐగా జయరాములు

ప్రజాశక్తి- కడప అర్బన్

టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా జయరాములు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రామాపురంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐగా విధులునిర్వహించారు. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2 టౌన్ ఎస్ఐ బాధ్యతలు చేపట్టారు.

మున్సిపల్ కార్మికుల పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వానికి, అధికారులకు నిర్లక్ష్యం తగదని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు సుంకర రవి పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎఫ్ఆర్ఎస్ ఫేస్ మాస్టర్ విషయమై కార్పొరేషన్‌లో కమిషనర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. నగర కమిటీ సభ్యులు ఇత్తడి ప్రకాష్, కంచు పాటి తిరుపాల్, జిల్లా నాయకులు గోపి మాట్లాడుతూ కమిషనర్ పాలక వర్గాలు మునిసిపల్ కార్మికుల పట్ల తీవ్ర నిర్లక్ష్యగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇంజినీరింగ్ విభాగంలో 11వ పిఆర్‌సి ప్రకారం దాదాపు రూ.30వేలు చెల్లించాల్సి ఉండగా రూ.15వేలు, రూ 18,500 చెల్లిస్తూ నామ మాత్రపు జీతాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎంప్లాయిస్ సైట్‌లో చూపుతూ ప్రభుత్వ పథకాలను వర్తింప జేయడం లేదని వాపోయారు. ఇప్పుడు కొత్తగా ఫేస్ మస్టర్ విధానం అమలుకు అధికారులు సర్క్యులర్ విడుదల చేసారు. బ్యాంకు ద్వారా జీతాలు చెల్లింపు చేయాలని, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. డి ఎలు,ఇంక్రిమెంట్లు పెండింగులో ఉన్నాయని చెప్పారు. సచివాలయ సెక్రటరీలు కమిషనర్ పేరు చెప్పి ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తున్నారు .కార్మికులను వేధింపులకు గురి చేస్తున్నారని వీరి పద్ధతి ని మార్చుకోవాలని చెప్పారు. డ్రైవర్లకు మోటర్ చట్ట ప్రకారం రూ. 32 వేల వేతనం, హెల్త్ అలవెన్స్ వర్తింపజేయాలని కోరారు. పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడదామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు నాగరాజు, శివకుమార్ వై. కుమార్‌పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందేస్తున్న నాయకులు

మహిళ అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండలంలోని గూడా వాండ్ల పల్లెకు చెందిన కారుణ్య అనే మహిళ కన్పించడం లేదని ఆమె భర్త నాగేంద్ర ఫిర్యాదు చేశారని ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కమలాపురం మండలం ఈడిగపల్లి గ్రామానికి చెందిన కారుణ్యకు 2015లో నాగేంద్రతో వివాహమైంది. ఆమె తరచూ కువైట్‌లో ఉన్న తన తల్లి బుజ్జమ్మతో ఫోన్‌లో మాట్లాడుతూ తన సమస్యలు చెప్పేదన్నారు. తాను త్వరంలో ఇండియాకు వస్తాను చెప్పేదన్నారు. విషయం తెలుసుకున్న నాగేంద్ర తల్లితో మాట్లాడొద్దని మందలించినట్లు పేర్కొన్నారు. మనస్తాపానికి గురైన కారుణ్య ఈనెల 5న తెల్లవారుజామున రెండు గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె భర్త ఫిర్యాదు చేశారని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికతను పెంపొందించవచ్చు

ప్రజాశక్తి - కడప

క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికతను పెంపొందించవచ్చని ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలలోని మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా పులివెందులలోని జినోమిక్స్ కార్లను విద్యార్థులు సందర్శించారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రియదర్శిని మాట్లాడుతూ అధునాతన పరిశోధనా విధానాలు తెలుసుకునేందుకు, పరిశోధనల వైపు ఆసక్తిని పెంపొందించడానికి విద్యార్థులకు క్షేత్ర పర్యటనలు ఉపయోగపడతాయని తెలియజేశారు. మానవ, వివిధ జంతువులలో వ్యాధులు గుర్తించే విధానాలు, నిర్ధారించే పరికరాల విధానాన్ని ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థులు సంతృప్తి చెందారు. కార్యక్రమంలో అధ్యాపకులు లావీన, మైక్రో బయాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి : ఆర్‌డిఒ

పెండ్లిమర్రి : ఈనెల 18న పొలతలలో నిర్వహించబోయే మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంత నిర్వహించేలా అధికారులు, ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కడప ఆర్‌డిఒ ధర్మ చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కడప డిఎస్‌పి వెంకటశివారెడ్డి, దేవాదాయ, ఆర్‌టిసి, విద్యుత్‌శాఖ, ఎక్సైజ్, అటవీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్, ఎంపిడిఒ అల్తాఫ్ హుసేన్, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కెసి కాల్వలో పూడికను తొలగించాలి : ఎంపిపి

చెన్నూరు : కొత్త రోడ్డు వద్దనున్న కెసి కాల్వ వెంబడి ఉన్న సైడ్ వాల్ దెబ్బతిందని, వ్యర్థాలను పూడికలను, పిచ్చి మొక్కలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కెసి కాలువ ఎఇ సుబ్బరాయుడుకు ఎంపిపి సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదు మేరకు చెన్నూరు కొత్త రోడ్డు వద్దనున్న కెసికెనాల్‌ను కెసి కెనాల్‌ను ఎంపిపి, ఎఇ, సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య, వైసిపి టౌన్ కన్వీనర్ ఎంపిటిసి ముదిరెడ్డి సుబ్బారెడ్డి, కార్యదర్శి రామసుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ కెసి కెనాల్ కు సంబంధించి లైనింగ్ కాలువ ఇరువైపులా సైడ్ వాల్ దెబ్బతిందని చెప్పారు. పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో కాల్వ పూడిపోయిందని, ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కాలువ మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ పిచ్చయ్య, చంద్ర, సురతాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

350 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

పోరుమామిళ్ల టౌన్ : పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచి యనమల సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 350 మందికి వైద్యపరీక్షలు చేశారు. వారికి మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. అపరేషన్ అవసరమైన వారికి సదుపాయాలు కల్పించారు. నంద్యాల శాంతిరాం ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. సుమారు వందవందిని కంటి ఆపరేషన్ కోసం నంద్యాల, శాంతిరాం ఆస్పత్రికి తీసుకెళ్లి కంటి అద్దాలు ఇచ్చి మళ్లీ వారి సొంత గ్రామానికి ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

బలిజ సంఘం అభివృద్ధికి కృషి చేద్దాం

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

కలిసి కట్టుగా బలిజ సంఘం అభివృద్ధికి కృషి చేద్దామని సంఘం అధ్యక్షులు గూడూరు గురు ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం సంఘం అధ్యక్షులుగా ఎన్నికై ఏడాది పూర్తి కావడంతో కమిటీ సభ్యులు పట్నంలోని శ్రీకృష్ణ దేవరాయ బలిసి సంఘంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ గురు ప్రసాద్ అధ్యక్షులుగా ఎన్నికైనప్పుడు నుంచి సంఘ అభివృద్ధికి ఎంత తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. కమిటీ సభ్యులు ఆయనకు ప్రసాద్ కు వెంకటేశ్వర స్వామి చిత్ర పటాన్ని అందజేశారు. అంతకు మునుపు పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అంకాలమ్మ గుడి మాజీ చైర్మన్ వెంకట సుబ్బయ్య, బొట్టు బాలయ్య, అంకాలమ్మ గుడి చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, బలిజ సంఘం నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, ఐటిఐ సాయి,లాయర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు తోటం శెట్టి హరి, నవీన్, నక్క హరి, సర్వేశ్వర, కృష్ణ, ఓం ప్రకాష్, కృష్ణ కుమార్, వీరయ్య, ధర్మిశెట్టి బాబు, శేషు కుమార్ సంఘీయులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న గురుప్రసాద్

కల్యాణమస్తు, షాదీ తోఫా పథకం ప్రారంభం

- మొదటి విడతగా 257 జంటలకు రూ.2.20 కోట్లు మంజూరు

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా పథకం ఆర్థిక సాయాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానం ద్వారా బటన్ నొక్కి మొదటి విడత లబ్దిదారుల ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి సాంఘిక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, డిఆర్‌డిఒ పీడీ ఆనంద్ నాయక్, ఎఎస్‌డిసి రామ్ మోహన్ హాజరయ్యారు. పథకానికి సంబంధించి వైఎస్ఆర్ జిల్లాలో ఏడాది అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 మధ్య కాలంలో వివాహం చేసుకున్న అర్హులైన 257 జంటలకు రూ. 2,20,10,000 లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు.

సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో రెండవ విడతలో గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగులుగా ఉద్యోగాలు పొంది రెండేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగికీ ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని ఎన్‌జి ఒ సంఘం జిల్లా అధక్షులు శ్రీనివాసులు, గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు హీరా మియా కోరారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సాయి కాంత్ వర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్, గ్రామ వార్డ్ సచివాలయం ఉద్యోగుల ఫెడరేషన్ కోశాధికారి లక్షుమయ్య పాల్గొన్నారు.



జెసికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌జిఒ నాయకులు

సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్ డాక్టర్ నిలవేణి పేర్కొన్నారు. శుక్రవారం స్టెప్ ఆధ్వర్యంలో మరియాపురంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్ లో కెరీర్ కౌన్సిలింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ కూడిన విద్యను అభ్యసించాలని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు విలువైన సూచనలను అందించారు. కార్యక్రమంలో వార్డెన్ మంజుల, స్టెప్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎంపిపి హరిత తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిడిఒ అరుంధతి అధ్యక్షతన మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మండలంలోని గ్రామాలలో ప్రజా సమస్యల పైన చర్చించాలన్నారు. ముఖ్యంగా విద్యుత్, గృహ సమస్యలు అధికంగా ఉన్నాయని చెప్పారు. సమావేశానికి విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరింగ్ అధికారి రాకపోవడంతో ముందుగా గండికోట సర్పంచ్ ఈశ్వర్ విద్యుత్ సమస్యను లేవనెత్తారు. అనంతరం పెద్ద దండ్లూరు సర్పంచ్ రామాంజనేయ రెడ్డి విద్యుత్ తీగలు కింద వేలాడుతున్నాయని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. మోరుగుడి సర్పంచ్ కొండయ్య మాట్లాడుతూ స్తంభాలు పాతబడి పోయాయని వాటిని మార్చడంలో చొరవ చూపడం లేదని వాపోయారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ సర్వ సభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అమృత నగర్‌లో నకిలీ పట్టాలు తయారు చేస్తూ పేదల స్థలాలు కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మనోహర్ రెడ్డికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతూ పేదలకు ఇచ్చిన స్థలాలలో కొందరు గ్రూపులుగా ఏర్పడి నకిలీ పట్టాలు తయారు చేస్తూ స్థలాలు కబ్జా చేస్తున్నారన్నారు. నిజమైన పట్టాదారులను వేధిస్తూ 'మీకు పట్టా కాగితాలు ఉంటే తీసుకురండి' అంటూ తహసీల్దార్ అవతారం ఎత్తుతున్నారన్నారు. ఇప్పటికే ఒక గ్రూపులోని సభ్యులు వందల స్థలాలు కబ్జా చేసి విక్రయించారని వాపోయారు. ఈ విషయం అంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ విషయంపై అవసరమైతే తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడతామని, కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారికి లేఖలు రాస్తామన్నారు. అధికారులు వెంటనే పేదవారికి అండగా నిలవాలని,నకిలీ పట్టాలు తయారుచేసి స్థలాలు అమ్ముకునే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ ముంతాజ్, పట్టణ కార్యదర్శి డి. వెంకట సుబ్బమ్మ, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు, పకీరయ్య, బాలసుబ్బయ్య, రమేష్, ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్, ఓబయ్య, శీను, యేసు, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగేశ్వర రావు

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

రానున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల కోసం శుక్రవారం తహశీల్దార్ నాగేశ్వర్‌రావు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం నాలుగు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో ఒకటి ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు, మిగిలిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూత్‌ను ఎర్రగుంట్ల బాలికల ఉన్నత పాఠశాలలో, మిగిలినవి ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో.మరొకటి ఆర్‌టిపిపి డిఎవి పాఠశాలలో ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వీరభద్ర పాల్గొన్నారు. **లింగాల :** పట్టబద్రల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూతులను తహశీల్దార్ శేషారెడ్డి, ఆర్ఐ సురేంద్ర, విఆర్ఒ నారాయణ పరిశీలించారు. లింగాలలోని జడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యునిగా తవ్వా వెంకటయ్య

ప్రజాశక్తి -ఖాజీపేట

మండలంలోని తవ్వారిపల్లెకు చెందిన తెలుగు అధ్యాపకులు, కథా రచయిత తవ్వా వెంకటయ్య అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. గురువారం తాడేపల్లి లో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్ భార్గవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. రెండేళ్ల పాటు ఈ హోదాలో తాను పనిచేయనున్నట్లు తెలిపారు. తెలుగు భాష అభివృద్ధికి, తెలుగు భాష అభ్యున్నతికి అంకితభావంతో తాను అహర్నిశలు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సహచర అధ్యాపకులు, స్నేహితులు, గ్రామస్తులు తవ్వా వెంకటయ్య నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



మందులు అందజేస్తున్న సంస్థ సభ్యులు

విభిన్న ప్రతిభావంతుడికి మందులు వితరణ

ప్రొద్దుటూరు :పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుడైన బాలునికి ఆదరణ స్వచ్ఛంద సేవాసంస్థ శుక్రవారం మందులు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రానికి ఇచ్చిన మాటమేరకు మానసిక వికలాంగుడైన మధుకు మందులు వితరణ చేశామన్నారు. వికలాంగులకు చేయూతనిచ్చి వారిని అక్కున చేర్చుకోవాలన్నారు. మందులు అందించేందుకు సహకరించిన దాతకు సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బెల్లంకొండ కుమారస్వామి, మాధవ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దువ్వూరు : రబీలో సాగు చేసిన అన్ని పంటలను తప్పక నమోదు చేయించుకోవాలని వ్యవసాయ మండలి చైర్మన్ వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి అమర్‌నాథరెడ్డి ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయశాఖ ద్వారా జరిగే కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి రైతూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో కెసి కెనాల్ కింద వరి సాగు చేసిన రైతులకు ఏప్రిల్ ఆఖరి వరకు నీరు ఇవ్వాలని సభ్యులు కోరారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సబ్సిడీపై ఇస్తున్నడ్రిప్, స్ప్రింకర్ల పరికరాలకు జిఎస్‌టి ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు సబ్సిడీపై తార్పాలిన్ పట్టలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్ పరికరాలు, డీజిల్ ఇంజన్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సాంబశివారెడ్డి, గ్రామ వ్యవసాయ నాయకులు విమత, చరణ్ పాల్గొన్నారు.

అధ్యాపకులు నైపుణ్యం పెంచుకోవాలి

పులివెందుల టౌన్ : అధ్యాపకులందరూ నైపుణ్యాన్ని పెంచుకోవాలని వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ జి రంగ జనార్ధన్ అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు ఇంజి నీరింగ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క అధ్యాపకుడూ డెవలప్మెంట్ ప్రోగ్రాములు, కాన్ఫరెన్స్‌లు వర్క్ షాప్‌లలో పాల్గొని నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. వారికి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వసుంధర, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం ముమ్మరం

ఎర్రగుంట్ల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల ప్రచారం ఎర్రగుంట్లలో ముమ్మరంగా సాగింది. పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి ఉమాదేవి శుక్రవారం ఎర్రగుంట్లలోని పట్టభద్ర ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలో విస్తృతంగా పర్యటించి ఓటర్లను కలిసి, ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే రాంగోపాల్ రెడ్డిని గెలిపించుకోవాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలలో ఆమె ప్రచారం నిర్వహించారు.

చిగురిస్తున్న మామిడి ఆశలు

గిట్టుబాటు ధరపైనే రైతుల దిగులు

ప్రజాశక్తి-చక్రాయపేట



విరబూసిన మామిడిపూత

మండలంలో ఈ ఏడాది మామిడితోటలు విరబూసాయి. దీంతో రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. మూడేళ్లుగా రైతులు కరోనాతో నష్టపోయారు. ఈ ఏడాదైనా సకాలంలో పంటలు వస్తే చేసిన అప్పుల తీరు తాయనే భావిస్తున్నారు. పూత నిలబడి కాయలు కాస్తే అప్పులన్నీ తీరు పోతుందని ఆశగా ఉన్నారు. గత నవంబర్, డిసెంబర్‌లోనే మామిడి పూత రావడంతో పంట దిగుబడి బాగా వస్తుందనే అంచనాలో ఉన్నారు. జనవరి, ఫిబ్రవరిలలోనూ పూత మరింత విరబూయడం, మంచు అంతం తమాత్రంగా ఉండడంతో కాపుపైన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరో వైపు కాయల దిగుబడి ఉన్నా గిట్టుబాధ ధర వస్తుందో రాదోననే అనుమానాలు రైతులను వెంటాడుతున్నాయి. రాయచోటికి చెందిన వ్యాపా రులు స్థానికంగా గోడౌన్లు ఏర్పాటు చేసుకున్నారు. దళారుల వ్యవస్థ అధికంగా ఉండడంతో రైతులు గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కాయలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తే తాము పడ్డ కష్టానికి, చేసిన అప్పులకు ప్రతిఫలం ఉంటుందని వారు భావిస్తున్నారు. కాపు బాగా కాసిందన సంతోషం, భవిష్యత్‌లో గిటుబా టుధర లేకపోవవడం, వ్యాపారులు, దళారుల ప్రమేయంతో ఉండదనే బాధ వారిని వెంటాడుతోంది.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



కుప్పగుట్టపల్లె సమీపంలో 12 ఎకరాలలో మామిడి సాగుచేశాం. పంట సాగు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేశాం. ఈ ఏడాది ముందుగానే విరివిగా పూత వస్తోంది. పంట చేతి కొచ్చినా దళారుల చేతుల్లో మోసపోతున్నాం. కావున ప్రభుత్వం చొరవ తీసుకొని పంటను కొని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తే ఆదాయం వస్తుంది. **- పెన్నబడి నాగభూషణ్ రెడ్డి, రైతు**

రాష్ట్రంలో పారదర్శక పాలన : ఎమ్మెల్యే



గడప గడపలో ప్రజలతో ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పారదర్శక పాలనతో రాష్ట్రం సుభీక్షంగా ఉందని, ముఖ్యమంత్రి రాష్ట్రంలో నవశకం పాలనను సాగిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని కొత్తపల్లి పంచాయతీలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం 204వ రోజు గడపగడప యాత్ర అత్యంత ఆర్భాటంగా, అట్టహాసంగా సాగింది. ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న డీసీఎస్ఆర్ లాడ్జీ నుంచి రిలయన్స్ ఎదురుగా ఉన్న టీచర్స్ కాలనీ, ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ఎమ్మెల్యే దంపతులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతను కల్పిస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనతి కాలంలోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేద ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పట్ల సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి కరంగా ఉన్నారని, ఏ గడపకు వెళ్లినా తమను ఆప్యాయంగా పలుకరిస్తున్నారన్నారు. మురుగు నీటి వ్యవస్థ, మంచి నీరు, విద్యుద్దీపాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్పర్సన్ మల్లెల ఝాన్సీ, రాజా రామిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు రెడ్డి, మున్సిపాలిటీ సచివాలయాల కన్వీనర్లు కాకర్ల నాగ శేషారెడ్డి, పోన భాస్కర్, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, అధ్యక్షురాలు కోనేటి సునంద, ప్రొద్దుటూరు మండల కన్వీనర్ కల్లూరు నాగేంద్ర రెడ్డి, వైయస్సార్సిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి గరిసెపాటి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కళావతి, పద్మావతి పాల్గొన్నారు.

మోడీ ప్రసంగం హాస్యాస్పదం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అప్పులు, ఆర్థిక క్రమశిక్షణ గురించి పార్లమెంటులో ప్రధాని మోడీ చేసిన ప్రసంగం హాస్యాస్పదంగా ఉందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకినట్లుంది' ప్రధాని మోడీ వైఖరి అన్నారు. మితిమీరిన అప్పులతో అనర్థం, పొరుగు దేశాలనైనా చూసి నేర్చుకొండి అని చెప్పడం శోచనీయమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భావితరాల భవితను బలి చేయవద్దు రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణను పాటించాలని రాష్ట్రాలకు హితబోధ చేస్తూ హెచ్చరించడం సబబు కాదన్నారు. మోడీ చెప్పిన సూత్రం కేంద్ర ప్రభుత్వానికి కూడా వర్తిస్తుందని అవిషయాన్ని ప్రధాని గ్రహించాలని చెప్పారు. మోడీ పాలనలో దేశం అప్పుల కుప్ప అయ్యిందని అన్నారు. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాలలో పండిట్ నెహ్రూ మెదలుకుని మన్మోహన్ సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.46 లక్షల కోట్లు కాగా, 2014 నుంచి 2022 వరకు 8 సంవత్సర కాలంలో మోడీ ప్రధానిగా కేంద్ర ప్రభుత్వం చేసిన అదనపు అప్పు రూ. 109 లక్షల కోట్లు అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 15.40 లక్షల కోట్లు కేంద్ర ప్రభుత్వం అప్పు చేస్తుందని బడ్జెట్ లో పేర్కొన్నారని చెప్పారు. మొత్తం బడ్జెట్ లో ఇది 34 శాతం అన్నారు. మితిమీరిన అప్పులు చేసింది చాలక మోడీ ప్రభుత్వం దేశాన్ని అమ్మకానికి పెట్టిందని చెప్పారు. కాంగ్రెసుతో పాటు గత ప్రభుత్వాలు నిర్మించిన నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రైల్వేలు, ప్రభుత్వ రంగ సంస్థలు తెగ అమ్మకానికి పెట్టింది మోడీ ప్రభుత్వం అన్నారు. ఇది చాలక ప్రజల మీద ధరలను పెంచి వీర బాదుడుగా బాదుతున్నట్లు ఆరోపించారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్, ఎరువుల ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు అన్నారు. . 1989 నుండి నేటి వరకు 34 సంవత్సరాలుగా నెహ్రూ కుటుంబం కేంద్రంలో అధికారంలో లేదు అయినప్పటికీ అ కుటుంబంపై ఆడి పోసుకోవడం శోచనీయం అన్నారు. అదాని చేతిలో జగన్‌కీలు బొమ్మగా మారడం అత్యంత శోచనీయమన్నారు. ఎదుటి వారికి నీతులు చెప్పే ముందు తాము ఆచరించి చూపాలని చెప్పారు.

అండర్ డ్రైయినేజీ పనులపై దృష్టి సారించాలి

- పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో చేపట్టబోయే భూగర్భ డ్రెయినేజీ పనులపై అధికారులు దృష్టి సారించాలని పులివెందుల ఓఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని ఎంపిడిఒ కార్యాలయంలో వేంపల్లె మండలంలో నిర్వహించే అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతం చేపట్టాలని కోరారు. వేంపల్లెలో చేపట్టే రోడ్డు విస్తరణ పనులు కూడా చేసేందుకు రోడ్డు భవనాల శాఖ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రోడ్డు విస్తరణకు సంబంధించి నష్ట పరిహారం వచ్చిన బాధితులందరూ వారి గృహాలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే భూగర్భ డ్రెయినేజీ పనులు త్వరితగతిన చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలో పెండింగ్ ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ భవనాలు పూర్తి చేయాలని చెప్పారు. జగనన్న కాలనీలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పారు. కాలనీలో ఉన్న ప్రతి ఇంటకీ విద్యుత్ మీటర్ల కనెక్షన్లు ఇవ్వాలని చెప్పారు. సమావేశంలో రోడ్డు భవనాల శాఖ ఇఇ సిద్దారెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జున, విద్యుత్ ఎడిఎ శ్రీకాంత్, మండల అధికారులు పాల్గొన్నారు

అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఎం

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

పెద్దముడియం తహశీల్దార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఉన్నతస్థాయి అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ తెలిపారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల కిందట పెద్దముడియం మండల తహశీల్దార్ జ్యోతి రత్న కుమారి వేధింపులు తాళలేక విఆర్ఓ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని చప్పారు. బాధిత విఆర్ఓ తహశీల్దార్ అవినీతి పై సూసైడ్ నోట్ కూడా రాశారని తెలిపారు. ఇటువంటి సంఘటన జరగడం బాధాకరమని వాపోయారు. విఆర్ఓ రాసిన లేఖ పైన అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కృష్ణారెడ్డి, హాజీ పాల్గొన్నారు.

'పంట చేతికి రావడం లేదు.. ఆదుకోండి'

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్

పంట వేసిన తర్వాత అది దిగుబడి రావడం లేదని దుగ్గనపల్లె, నవాబుపేట రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఓ శ్రీనివాసులుకు ఆ గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ దాల్మియా సిమెంట్ పరిశ్రమ విడుదల చేసే వ్యర్థాలు, దుమ్ము వల్ల వేసిన పంట దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రతి ఏడాదీ నష్టపోతూనే ఉన్నామని సిమెంట్ పరిశ్రమ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అలాగే దుగ్గన పల్లె గ్రామంలోని వారికి నష్టపరిహారం ఇప్పించి వారికి వేరే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు. అనంతరం ఆర్‌డిఓ మాట్లాడుతూ బుధ, గురువారాల్లో గ్రామాన్ని సందర్శించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్డిపల్లె మల్లికార్జున, నవాబుపేట మాజీ సర్పంచ్ శెట్టిపల్లె శివ శంకర రెడ్డి, దుగ్గనపల్లె గ్రామ రైతులు కళ్యాణ్ బాబు, విజేయుడు, దేవరాజు, ఇమ్మానిల్, ప్రజలు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

క్రైం కార్నర్

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి రహదారిలోని ఓ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా భారీగా అక్రమ రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు కడప విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు రామకృష్ణ, డిటి వరద కిషోర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని యామవరం సమీపంలో ఉన్న భ్రమరాంబ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు చెప్పారు. సుమారు 520 బస్తాలు (26 టన్నులు) రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. బియ్యంతోపాటు లారీని స్వాధీనం చేసుకుని రైస్ మిల్ యజమాని చింత నవీన్ కుమార్ రెడ్డి,లారీ డ్రైవర్ హేమంత్ పైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా భ్రమరాంబ రైస్ మిల్లుకు తరలిస్తున్న 86 బస్తాలున్న (4,300 కిలోల) టాటా మ్యాజిక్, మహేంద్ర బొలెరో వాహనాలలో సీజ్ చేసినట్లు తెలిపారు. లోకేష్, గంగాధర్ పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే యామవరం గ్రామం వద్ద కొండాపురం వైపు నుంచి భ్రమరాంబ రైస్ మిల్‌కు తరలిస్తున్న మరో టాటాజనో, మహేంద్ర మాక్సిమో వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. అందులో సుమారు 82 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మునింద్రా, రాము, సంజీవ రాయుడు అనే నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులున్నారు.



ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కుష్టువ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదనపు ఆధికారి (ఎయిడ్స్ అండ్ లెప్రసి) డాక్టర్ ఖాదర్‌వలి అన్నారు. జాతిపిత మహాత్మగాంధి వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక లైట్‌పాలెంలో శుక్రవారం మిడ్‌టౌన్ రోటరీ క్లబ్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అందరి సహకారంతో కుష్టురహిత సమాజంకోసం పాటుపడుదాం అన్నారు. అనంతరం 25 మంది కుష్టువ్యాధి గ్రస్తులకు రోటరీక్లబ్ సహకారంతో దుప్పట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారాసుటికల్ జిల్లా అదికారి నాగన్న ఫిజియోథెరపిస్ట్ విక్టర్‌మనోహర్, డిపిఎంఒ శివశంకరయ్య, యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షాహినాసుల్తానా, క్లబ్ అధ్యక్షుడు తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు జగదీష్, కోశాధికారి సాదు శివనారాయణ, సిఒలు శ్రీదేవి, సుబ్బారెడ్డి, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **కుష్టు వ్యాధిపై అవగాహన**

చాపాడు : కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన అవసరమని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధికి సంబంధించిన రాగి రంగు, స్పర్శ లేని మచ్చలు మండలంలో ఎవరికైనా ఉన్నా అధికారులకు తెలియజేయాలన్నారు. కుష్టు వ్యాధి నివారణలో భాగంగా విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కస్తూరిబా పాఠశాల లో భోజన వసతిని పరిశీలించారు. స్కూలు పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం లక్ష్మీ పేటలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య చికిత్సను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధి కారి రాజేష్ కుమార్ , ఫిజియోథెరపీ డాక్టర్ మనోహర్, డాక్టర్ శ్రీవాణి , సిహెచ్ఒ నాగన్న, రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టిడిపి మండల కన్వీనర్ మునిరెడ్డి

బిటెక్ రవికి మెజార్టీని గిఫ్ట్‌గా ఇస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కార్యకర్తలు అందరూ కష్టపడి పని చేసి వచ్చే పుట్టిన రోజు నాటికి ఎంఎల్‌సి బిటెక్ రవికి మెజార్టీని గిఫ్ట్‌గా ఇస్తామని టిడిపి మండల టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి 52వ పుట్టిన రోజు సందర్భంగా వేంపల్లెలోని టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె మండలంలో టిడిపి పార్టీకి మెజార్టీ వచ్చేందుకు ఇప్పటి నుండే ప్రతి టిడిపి కార్యకర్తా, నాయకులూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. టిడిపి కార్యకర్తలు అందరూ ఐకమత్యంగా ఉంటే మెజార్టీ సులువుగా వస్తుందని అదిశగా ప్రయాణించాలని కోరారు. అనంతరం కేక్ ను కార్యకర్తలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎద్దుల శేషారెడ్డి, పాపిరెడ్డి, ఆర్.వి రమేష్, తెలంగాణ వలి, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వీరబద్ర, పూల అల్లాబక్షు, గొగుల మల్లికార్జున, గొగుల మారుతి, ఆలయం మాజీ చైర్మన్ వెంకట స్వామి, ఆదినారాయణ, కత్తులూరు మల్లి, వెంకట శివ, గోపాల్ రెడ్డితో పాటు అయా గ్రామంలోని టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు. మండలంలోని టి.వెలమవారిపల్లెలోని 33/11 కెవి సబ్ స్టేషన్‌కు చెందిన ఎస్ఎస్‌లోని 11 కెవి ఫీడర్ నెలవరం తాండ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఉదయం 8గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న రైతులు, ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'పది' మోడల్ పరీక్షను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-మైలవరం

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ కడప జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎంఎల్‌సి లక్ష్మణరావ్ పర్యవేక్షణలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించనున్న ప్రజ్ఞా వికాసం పరీక్షను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రరవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ విద్యార్థులను చదువుల్లోనూ ముందుండాలని కోరుకుంటూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ కమిటీ పదో తగతి విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం మోడల్ పరీక్షను ఫిబ్రవరి 20న జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. విద్యార్థులను పోటిప్రపంచంలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు, పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. 100 మార్కుల ప్రశ్నపత్రంలో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలుంటాయని, పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు ఉంటుందని, పరీక్ష ఎంట్రీఫీజు రూ.30 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎ నాయకులు బాను ప్రకాష్, సురేంద్ర రాజ , సుదర్శన్ పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9912921048లో సంప్రదించాలని తెలిపారు.